సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం ♦ 20 ♦ జూన్ ♦ 2023



ఆర్వోఎఫ్ఆర్ పట్టాలివ్వాలి

తాము సాగు చేసుస్తున్న కొండపోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని గిరిజనులు స్పందనలో అర్జీ అందజేశారు. 8లో



రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం కృషి

అన్ని రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. 8లో



అక్రిడిటేషన్లు మంజూరు

పాత్రికేయులకు అక్రిడిటేషన్లు మంజూరు చేశారు. తొలి విడతగా 125 మందికి జారీ చేసినందుకు ఆమోదం లభించింది. 8లో

న్యూస్‌రీల్

వీఆర్‌పురం ఎఫ్ఆర్‌వోగా శ్రీనివాసరావు



వీఆర్‌పురం: వీఆర్ పురం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్(ఎఫ్ఆర్‌వో)గా కె.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇక్కడ రేంజర్‌గా పనిచేసిన శ్రీనివాసరెడ్డి కొద్ది రోజుల క్రితం ఏలూరు అటవీ శాఖ పరిధి లాగింగ్ విభాగానికి బదిలీ అయ్యారు. అప్పటినుంచి ఇన్‌చార్జ్ రేంజర్‌గా కూనవరం ఎఫ్ఆర్‌వో మోహినీ విజయలక్ష్మి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కాగా సాధారణ బదిలీల్లో భాగంగా కె.శ్రీనివాసరావు వీఆర్ పురం రేంజ్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది సహకారంతో అడవుల సంరక్షణే ధ్యేయంగా విధులు నిర్వహిస్తానని ఆయన చెప్పారు.

నేడు ఎంఎస్ఎస్‌సీ ఖాతాలపై ప్రత్యేక డ్రైవ్

ముంచంగిపుట్టు: అరకు సబ్ డివిజన్ పరిధిలో పోస్టల్ శాఖ ద్వారా మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్(ఎంఎస్ఎస్‌సీ) ఖాతాలపై ఈ మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్టు అరకు ఐపీవో బి.ఉపేంద్ర తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం పోస్టల్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన ఈ ఖాతాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కనిష్టం రూ.1000 నుంచి గరిష్టం రూ.2 లక్షలతో ఈ ఖాతాను తెరవవచ్చని తెలిపారు. ఖాతా తెరిచి 2 సంవత్సరాల పాటు పొదుపుచేస్తే ఆ తర్వాత అత్యధిక వడ్డీతో సొమ్మును పొందవచ్చని, ప్రతి మహిళా తీసుకోవలసిన ఖాతా ఇది అని చెప్పారు. మంగళవారం అరకు, అరకు ఆర్ఎస్,పెదబయలు సబ్ పోస్ట్ కార్యాలయాల్లో, బ్రాంచ్ పోస్ట్ కార్యాలయాల్లో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

బాలికపై లైంగిక దాడికి బాలుడు యత్నం

కొయ్యూరు: మూలపేట పంచాయతీ కొండసంత గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన ఓ బాలుడు లైంగిక దాడికి యత్నించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో తల్లిదండ్రులు వచ్చి ఆ బాలుడిని పట్టుకున్నారు. బాలిక సోమవారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లింది. ఆమెను వెంబడించిన బాలుడు లైంగిక దాడికి యత్నించాడు. మరో బాలుడు సహకరించాడు. దీంతో ఇద్దర్నీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సమాచారం అందుకున్న దిశా టీమ్ సంఘటన స్థలానికి చేరుకుని బాధిత బాలికను నర్సీపట్నం ఆస్పత్రికి తరలించింది.బాధితుల ఫిర్యాదు మేరకు కొయ్యూరు పోలీసులు విచారణ చేస్తున్నారు.

మార్చురీలోకి ప్రైవేట్ వ్యక్తులకు అనుమతి లేదు



మార్చురీ వార్డును పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ కృష్ణారావు

చింతపల్లి: స్థానిక ఏరియా ఆస్పత్రి మార్చురీలోకి ప్రైవేట్ వ్యక్తులను అనుమతించడం లేదని డీసీహెచ్ఎస్ కిల్లో కృష్ణారావు తెలిపారు.సోమవారం ఆయన ఆస్పత్రిని సందర్శించి, మార్చురీ విభాగాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇక్కడ పోస్టుమార్టం అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉండడంతో ప్రైవేట్ వ్యక్తులతో శవ పంచానామా నిర్వహించేవారని చెప్పారు. ఇప్పుడు ఆ పోస్టును భర్తీ చేయడం వల్ల ప్రైవేట్ వ్యక్తులను అనుమతించడం లేదని చెప్పారు. స్థానిక వైద్యాధికారులు కూడా బాధిత కుటుంబ సభ్యులకు ఈ విషయాన్ని తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటిండెంట్ ఆదిత్య కీర్తి తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానంలో అడ్మిషన్లు

పాడేరు రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానంలో అడ్మిషన్లు ప్రారంభమైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టాబ్బాయ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు అన్ని ధ్రువీకరణ పత్రాలతో కళాశాలకు వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఈనెల 21న సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.

గిరిసీమలో తొలకరి సందడి





సంప్రదాయ వేట కోసం అడవికి వెళుతున్న ఆదివాసీలు (ఇన్‌సెట్) నృత్యం చేస్తున్న ఆదివాసీ మహిళలు

- మన్యంలో భూమి పండగ సందడి
- విల్లంబులతో వేటకు వెళుతున్న పురుషులు
- ఆటపాటలతో మహిళల కోలాహలం

చింతూరు: వసంతం రాగానే వనం పులకించి పూలు పూసి పరిమళిస్తుంది. తొలకరి చినుకులు తాకగానే వేసవిలో వేగిన భూమి పులకించి, తానే ఒక భారీ విరిలా అద్వితీయమైన పరిమళాన్ని వెదజల్లుతుంది. అదే సమయంలో మన్యంలోని ఆదివాసీలు జరుపుకొనే భూమి పండగ అటు వనానికి వన్నెనిస్తూ ఇటు సంప్రదాయ సుగంధాన్ని వ్యాపింపజేస్తుంది. తొలకరి ప్రారంభంలో మూడు రోజుల పాటు జరిగే భూమి పండగ మన్యం వ్యాప్తంగా గిరి పల్లెల్లో కోలాహలంగా సాగుతోంది. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి, తమ భూముల్లో సిరులు పండాలని కోరుకుంటూ కుల దేవతలతో పాటు విత్తనాలకు, భూమికి పూజ నిర్వహించడమే ఈ పండగ ప్రాముఖ్యత. ఈ పండగ ముగియగానే అందరూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతారు.

వేట, ఆట, పాట

భూమి పండగ జరిగే మూడు రోజుల పాటు పురుషులంతా కలసి విల్లంబులు చేతబూని సంప్రదాయక వేట కోసం అడవిబాట పడతారు. ఇదే సమయంలో మహిళలు పండగ నిర్వహణకు కావాల్సిన ఖర్చుల నిమిత్తం గ్రామ సమీపంలోని రహదారుల వద్దకు చేరుకుని సంప్రదాయ రేల నృత్యం చేస్తూ, పాటలు పాడుతూ, వచ్చీపోయే వాహనాలను



వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న గిరి మహిళలు

ఆపుతూ డబ్బులు వసూలు చేస్తారు. కొన్ని గ్రామాల మహిళలు గుంపులుగా మండల కేంద్రాలకు వచ్చి దుకాణాల వద్ద కూడా డబ్బులు అడుగుతారు. ఇలా మూడు రోజుల పాటు వసూలైన నగదుతో పూజకు కావాల్సిన సామగ్రి కొనుగోలు చేసి పండగను వైభవంగా నిర్వహిస్తారు. ఇక ఉదయం అడవికి వేటకు వెళ్లిన పురుషులు సాయంత్రానికి ఇళ్లకు చేరుకుంటారు. వేటలో భాగంగా ఏదైనా జంతువును వేటాడితే దానిని గ్రామస్తులంతా కలసి సమాన వాటాలుగా పంచుకుంటారు. ఏ జంతువును వేటాడకుండా ఖాళీ చేతులతో తిరిగి వచ్చిన పురుషులపై మహిళలు పేడనీళ్లు జల్లి స్వాగతం పలకడంగా ఆదివాసీ సంప్రదాయంలో భాగం కావడం విశేషం.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాలి



సంస్కృతి, సంప్రదాయాలను రాబోయే తరాలకు అందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి. ఆదివాసీలంతా తమ సంప్రదాయ పండగలు తప్పక నిర్వహించాలి. పండగలు నిర్వహించడం ద్వారా ఆదివాసీలు తమ సమైక్యతను చాటుకునే అవకాశం ఉంటుంది.

– సోడె మురళి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకుడు

వేట అంటే ఎంతో ఇష్టం



భూమి పండగలో భాగంగా నిర్వహించే వేట అంటే మాకు ఎంతో ఇష్టం. గ్రామస్తులమంతా కలసి ఉదయమే వేటకు వెళ్లి దొరికిన జంతువును వేటాడి సాయంత్రానికి ఇళ్లకు చేరుకుంటాం. వేటాడిన జంతువును అందరం కలసి పంచుకుంటాం.

–నవలం చినబాబు, చూటూరు, చింతూరు మండలం

త్వరితగతిన మెడికల్ కళాశాల నిర్మాణం

- డిసెంబర్‌కు ప్రధాన బ్లాకులు పూర్తి
- ఏపీఎంఎస్ఐడీసీ వీసీ, ఎండీ మురళీధర్‌రెడ్డి ఆదేశాలు



మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏపీఎంఎస్ఐడీసీ వీసీ, ఎండీ మురళీధర్‌రెడ్డి, కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రం పాడేరులో రూ.500కోట్లతో నిర్మిస్తున్న మెడికల్, నర్సింగ్ కళాశాలల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర మెడికల్ సర్వీసెస్, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, ఎండీ డి.మురళీధర్‌రెడ్డి... ఎన్‌సీసీ నిర్మాణ సంస్థ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన పాడేరులో పర్యటించారు. కలెక్టర్ సుమిత్ కుమార్,ఇతర అధికారులతో కలిసి మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. అన్ని బ్లాకుల్లో చురుగ్గా పనులు జరుగుతుండడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంత వరకు జరిగిన పనులు,పెండింగ్ పనులపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ అన్ని బ్లాకుల్లో పనులు వేగవంతానికి చర్యలు తీసుకోవాలని, ఈ ఏడాది డిసెంబర్ నాటికి ముఖ్యమైన బ్లాకుల భవన నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. కళాశాల హాల్‌లు, లైబ్రరీ, లేబరేటరీ వంటి బ్లాకుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. డిసెంబర్‌లో నేషనల్ మెడికల్ కౌన్సిల్ తనిఖీ ఉన్నందున ఎన్ఎంసీ నిబంధనల మేరకు పనులు జరగాలన్నారు. కలెక్టర్ సూచనలను పరిగణలోకి తీసుకుని ఎప్పటికప్పుడు నిర్మాణాల ప్రగతిని నివేదించాలన్నారు. అంతకుముందు జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. అవసరమైన మౌలిక సదుపాయాలు,పరికరాలపై ఆరా తీశారు. జిల్లా ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకుంటామని మురళీధర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ పర్యవేక్షక ఇంజినీర్ శివకుమార్, ఈఈ అచ్చంనాయుడు, డీఈఈ వర్మ,ఏఈఈ సురేష్,జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ కృష్ణారావు,ఎన్‌సీసీ నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం,డిప్యూటీ వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు

- జేవీకే కిట్లు పంపిణీ చేయలేదని ఐటీడీఏ పీవో అభిషేక్ ఆగ్రహం



విద్యార్థినుల కోసం తయారు చేసిన అన్నాన్ని పరిశీలిస్తున్న పీవో అభిషేక్

జి.మాడుగుల: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేయకపోతే కఠిన చర్యలు తప్పవని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ హెచ్చరించారు. కె.కోడాపల్లి పంచాయతీ బందవీధి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ, జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ పరిశీలించారు. విద్యార్థినులకు కేవీకే కిట్లు, పుస్తకాలు పంపిణీ చేయకపోవడంతో ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం కె.సుమిత్ర, డిప్యూటీ వార్డెన్ పి.శాంతికుమారిలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పాఠశాల తెరిచిన దగ్గర నుంచి హెచ్‌ఎం సెలవులో ఉండడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు సరిపడా భోజనం తయారు చేయకపోడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులందరూ ఆశ్రమ పాఠశాలలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. బందవీధి బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి, నివేదికను సమర్పించాలని గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు (డీడీ)ఐ.కొండలరావు, సహాయ గిరిజన సంక్షేమ అధికారి(ఏటీడబ్ల్యూవో) తిరుపాల్‌ను ఆయన ఆదేశించారు.జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీలో జాప్యం చేస్తే సహించేదిలేదని ఆయన హెచ్చరించారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని పీవో సూచించారు.

డ్రైవింగ్ లైసెన్స్ మేళా ప్రారంభం



పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్

చింతపల్లి: మండల కేంద్రం చింతపల్లిలో సోమవారం డ్రైవింగ్ లైసెన్స్ మేళాను ప్రారంభించారు. అదనపు ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్ మేళాను సందర్శించారు. చింతపల్లి, కొయ్యూరు, జీకే వీధి మండలాలకు చెందిన అర్హత కలిగిన యువతీయువకులకు డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు చేసేందుకు కలెక్టర్ సుమిత్ కుమార్,ఎస్పీ తుహిన్‌సిన్హా ప్రత్యేక ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో సోమవారం నుంచి 26వ తేదీ వరకూ మేళాను నిర్వహిస్తున్నట్టు అదనపు ఎస్పీ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీఐ రమేష్,ఎంపీడీవో ఆశాజ్యోతి,ఎస్ఐ అరుణ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు.. జగనన్న సురక్ష లక్ష్యం

- కలెక్టర్ సుమిత్ కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు: అర్హులైన వారెవరూ మిగిలిపోకుండా అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు,వెలుగు ఏపీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్న సురక్ష పథకం అమలు, విధి విధానాలను కలెక్టర్ సమగ్రంగా వివరించారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు,తహసీల్దార్లు రెండు బృందాలుగా ఏర్పడి, మండల స్థాయి అధికారులను సభ్యులుగా నియమించాలన్నారు. పర్యటన షెడ్యూల్ తయారు చేసుకోవాలని, ఈనెల 20న జగనన్న సురక్ష పథకం అములుపై శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ఈనెల 24 నుంచి గ్రామ సచివాలయాలను సందర్శించి,జగనన్న సురక్షపై అవగాహన కల్పించాలని తెలిపారు. అదే రోజు నుంచి సచివాలయాల ఉద్యోగులు,గ్రామ వలంటీర్లు ఇంటింటా తిరిగి,ప్రజల సమస్యలు తెలుసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

పత్రాల జారీపై ప్రత్యేక దృష్టి

అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల జారీపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి సచివాలయాల స్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ప్రజల సమస్యలు పరిష్కరించాలన్నారు. కుల,ఆదాయ,జనన, మరణ,వివాహ ధ్రువీకరణ పత్రాలు, సాగు హక్కు కార్డులను వెంటనే జారీ చేయాలని తెలిపారు. మ్యుటేషన్ లావాదేవీలు,ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం చేయాలన్నారు. కొత్తకార్డుల జారీ,ఆధార్ కార్డుల్లో సవరణ ప్రక్రియలను విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ శివశ్రీనివాస్, పాడేరు, రంపచోడవరం ఐటీడీఏల పీవోలు వి.అభిషేక్,సూరజ్ గనోరే, సబ్‌కలెక్టర్ శుభం బన్సాల్,ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ,ఆర్డీవో అంబేడ్కర్,డీపీవో కొండలరావు, డీఎల్‌పీవో కుమార్, డీఆర్‌డీఏ పీడీ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమం

- డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్‌బాషా



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్‌బాషా

పాడేరు రూరల్ : జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమాన్ని ఈనెల 26 నుంచి నిర్వహించనున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జమల్‌బాషా తెలిపారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల వైద్యాధికారులు, నోడల్ అధికారులు, పీహెచ్‌సీల సూపర్‌వైజర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, కుష్టు నివారణ అందరి బాధ్యత అని చెప్పారు. వ్యాధిపై సర్వే కార్యక్రమాన్ని ఈనెల 26 నుంచి వచ్చేనెల 16 వరకు నిర్వహించాలని ఆదేశించారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపించడానికి 3నుంచి 5ఏళ్ల వరకూ పట్టవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కుష్టు లక్షణాలు ఉంటే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధిగ్రస్తులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో మందులు ఉచితంగా ఇస్తున్నట్టు తెలిపారు. కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే ఈ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ టి.విశ్వేశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: కుష్టువ్యాధి నివారణకు వైద్యసిబ్బంది కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య అన్నారు. ఈనెల 26 నుంచి వచ్చేనెల 16 వరకు చేపట్టనున్న కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమంపై సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యసిబ్బంది వలంటీర్ల సాయంతో క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు.

పలు రైళ్లు రద్దు

తాటిచెట్లపాలెం : ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో భద్రతా పనుల నిమిత్తం పలు రైళ్లు రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పయాణికులు మార్పులను గమనించి సహకరించాలని కోరారు.

- ఎర్నాకుళంలో 19న బయల్దేరాల్సిన ఎర్నాకుళం – పాట్నా (22643) ఎక్స్‌ప్రెస్, పాట్నాలో ఈనెల 22న బయల్దేరాల్సిన పాట్నా – ఎర్నాకుళం (22644) ఎక్స్‌ప్రెస్,బెంగళూరులో ఈనెల 21న బయల్దేరాల్సిన ఎస్ఎంవీ బెంగళూరు – హౌరా (22864) ఎక్స్‌ప్రెస్ ,షాలిమార్‌లో ఈనెల 20న బయల్దేరాల్సిన షాలిమార్ – హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు.

హైదరాబాద్‌లో ఈనెల 20న బయల్దేరాల్సిన హైదరాబాద్ – షాలిమార్ (18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, షాలిమార్‌లో ఈనెల 20న బయల్దేరాల్సిన షాలిమార్ – చెన్నై సెంట్రల్ (22825) ఎక్స్‌ప్రెస్ , షాలిమార్‌లో ఈనెల 20న బయల్దేరాల్సిన షాలిమార్ – విశాఖపట్నం (22853) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ , సంత్రగచ్చిలో ఈనెల 20న బయల్దేరాల్సిన సంత్రగచ్చి – చెన్నై సెంట్రల్ (22807) ఎక్స్‌ప్రెస్ , సికింద్రాబాద్‌లో ఈనెల 20న బయల్దేరాల్సిన సికింద్రాబాద్ – షాలిమార్ (12774) ఎక్స్‌ప్రెస్, విల్లుపురంలో ఈనెల 20న బయల్దేరాల్సిన విల్లుపురం – ఖరగ్‌పూర్ (22604) ఎక్స్‌ప్రెస్, హౌరాలో ఈనెల 20న బయల్దేరాల్సిన హౌరా – ఎం. విశ్వేశ్వరయ్య టెర్మినల్ (22887) ఎక్స్‌ప్రెస్ , చెన్నై సెంట్రల్‌లో ఈనెల 22న బయల్దేరాల్సిన చెన్నై సెంట్రల్ – సంత్రగచ్చి (22808) ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్‌లో ఈనెల 21న బయల్దేరాల్సిన చెన్నై సెంట్రల్ – షాలిమార్ (22826) ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

రీ షెడ్యూల్ చేసిన రైళ్లు

- కేఎస్ఆర్ బెంగళూరులో సోమవారం మధ్యాహ్నం 1.40 గంటలకు బయల్దేరాల్సిన బెంగళూరు – భువనేశ్వర్ (18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 5.15 గంటలకు బయల్దేరింది.
- షాలిమార్‌లో సోమవారం మధ్యాహ్నం 3.20 గంటలకు బయల్దేరాల్సిన షాలిమార్ – చెన్నై సెంట్రల్ (12841) కోరమండల్ ఎక్స్‌ప్రెస్ సుమారు 9 గంటలు ఆలస్యంగా మధ్యరాత్రి 12.30గంటలకు బయల్దేరింది.

క్లుప్తంగా

రాజవొమ్మంగి ఎంఈవో-2గా సూరారెడ్డి



రాజవొమ్మంగి: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న తూము సూరారెడ్డిని రాజవొమ్మంగి ఎంఈవో-2గా నియమించారు. ఆయన మంగళవారం విధుల్లో చేరుతారు. హెచ్ఎం నుంచి ఎంఈవోగా పదోన్నతి పొందిన ఆయనను తోటి ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు.

ఈశ్వరరావుకు అభినందనలు



డాక్టరేట్ పొందిన ఈశ్వరరావును సన్మానిస్తున్న కరకపుట్టు గిరిజనులు

సాక్షి, పాడేరు: పలు పరిశోధనలకు సంబంధించి ఆంధ్రా విశ్వవిద్యాలయంలో డాక్టరేట్ పొందిన కూడా ఈశ్వరరావును డి.గొందూరు పంచాయతీ, కరకపుట్టు గిరిజనులు ఆదివారం రాత్రి ఘనంగా సన్మానించారు. కరకపుట్టు అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈశ్వరరావును దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. అలాగే టెన్త్, ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

బైక్ ప్రమాదంలో యువకుడి మృతి



తీవ్రంగా గాయపడిన పర్యాటకుడు రాజేష్

డుంబ్రిగుడ : చాపరాయి జలపాతం తిలకించేందుకు సోమవారం అరకులోయ నుంచి డుంబ్రిగుడ వస్తుండగా మార్గమధ్యంలో అంత్రిగుడ సమీపంలో ప్రమాదవశాత్తూ బైకు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. విశాఖపట్నం మధురవాడ వాంబే కాలనీకి చెందిన లకకుల రాజేష్ (23) ఓ మహిళతో కలిసి బైక్ మీద వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ముఖం మీద తీవ్ర గాయలు కావడంతో పాటు ఎడమ చేయి విరిగిపోయింది. స్థానికుల సహకారంతో క్షతగాత్రుడిని 108 వాహనంలో అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

పాత్రికేయులకు అక్రిడిటేషన్లు మంజూరు

- తొలి విడతలో 125 మందికి కార్డులు జారీ



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పాడేరు రూరల్: కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్, జిల్లా అక్రిడిటేషన్ చైర్మన్ అధ్యక్షతన అక్రిడిటేషన్ కమిటీ తొలి సమావేశం సోమవారం నిర్వహించారు. అల్లూరి జిల్లాలోని పలు పాత్రికేయులకు అక్రిడిటేషన్ల మంజూరు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ పాత్రికేయులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని, దీంతో సమాజానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఎన్నో వ్యయ, ప్రయాసాలు ఎదుర్కొంటూ జర్నలిస్టులు విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. వార్తలు రాసే క్రమంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం కమిటి సభ్యులతో చర్చించి జిల్లాలో తొలి విడతగా 125 మందికి ఎక్రిడిటేషన్ల జారీకి ఆమోదం తెలిపారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించాలని, కొత్తగా ఎవరైన దరఖాస్తు చేసుకుంటే , అర్హతలను పరిశీలించి సకాలంలో అక్రిడిటేషన్లు జారీకి నిర్ణయం తీసుకునేందుకు ప్రతిపాదించాలని జిల్లా సమాచార శాఖ అధికారి గోవిందరాజులను ఆదేశించారు. జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటానని, ఇందులో భాగంగా మెడికల్ క్యాంపుల నిర్వహణకు విశాఖలోని డాల్ఫిన్ దయాగ్నోస్టిక్, గాయత్రి మెడికల్ కళాశాలలకు లేఖలు రాయాలని వైఎస్సార్ ఆరోగ్య శ్రీ జిల్లా కోఆర్డీనేటర్ డాక్టర్ రాజేష్‌ను ఆదేశించారు. జిల్లాలోని జర్నలిస్టుల పిల్లల ఫీజుల కోసం ప్రైవేట్ స్కూల్స్‌లో 50 శాతం రాయితీల కోసం ఆదేశాలు జారీ చేయాలని జిల్లా అక్రిడిటేషన్ సభ్యుడు దుర్గారావు కోరగా దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారి, పాఠశాల యాజమన్యాలకు ఆదేశాలకు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. పాడేరు, అరకు, రంపచోడవరం నియోజకవర్గ కేంద్రాల్లో జర్నలిస్టులకు ప్రెస్ అకాడమీ నుంచి ఒకటి, రెండు రోజుల శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు రామచంద్రరావు, శ్రీను, మత్స్యరాజు, హౌసింగ్ ఈఈ పి.బాబు, పాడేరు ఆర్టీసీ డిపో మేనేజర్ వి.శ్రీనివాస్, కార్మిక శాఖ ఉప కమిషనర్ టి.సుజాత, అరకు రైల్వే స్టేషన్ మేనేజర్ రాహుల్, సమాచార, పౌర సంబంధాల శాఖ డివిజనల్ అధికారి పండు రాములు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాల్లో శిక్షణ ఇస్తున్న కళాశాల సిబ్బంది

అరకులోయ రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాలపై సోమవారం కళాశాల సిబ్బంది అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేయాలని కోరారు.వైస్ ప్రిన్సిపాల్ పద్మలత, పీవోలు నాగబాబు, విజయలక్ష్మి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాలపై అవగాహన

పాడేరు రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్లో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సోమవారం యోగా వర్క్‌షాపు నిర్వహించారు. ఎస్.సాంబమూర్తి యోగాసనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.ఎన్. రసూల్, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, సీనియర్ అధ్యాపకులు మురళీధర్ , ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.రమేష్, గౌరీశంకర్‌రావు పాల్గొన్నారు.

హుకుంపేటలో భారీ వర్షం

హుకుంపేట: మండలంలో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. వర్షం కారణంగా సంతారిన పంచాయతీ లివిటి గ్రామంలో ఓ విద్యుత్ స్తంభం కూలిపోయింది. ఆ సమయంలో విద్యుత్‌సరఫరా లేకపోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.

'జగనన్న సురక్ష' పై విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి,పాడేరు: ప్రజా సమస్యలు తెలుసుకోవడం, వెను వెంటనే పరిష్కారం లక్ష్యంగా ఈ నెల 21నుంచి నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అరకు నియోజకవర్గంలో విజయవంతం చేయాలని, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. పాడేరులోని తన నివాస గృహంలో హుకుంపేట మండల నాయకులు, సర్పంచ్‌లతో ఆయన సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ అన్ని సచివాలయాల పరిధిలో ప్రజాప్రతినిధులు, అన్ని విభాగాల పార్టీ నాయకులు జగనన్న సురక్ష కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, పీఎసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కిల్లో రామకృష్ణ, సర్పంచ్‌లు పాంగి బేస్, సీదరి సాంబ, సింహచలం, కొప్పల లక్ష్మయ్య, ఎంపీటీసీలు కొర్రా నాగరాజు, పరధాని భీమలింగేష్, నాయకుడు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం



పసుపు శుద్ధీకరణ యంత్రాలు పంపిణీ చేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పసుపు సాగు చేస్తున్న గిరిజన రైతులు 73 పాలిసింగ్ యంత్రాలు, ఆరు ఉడకబెట్టే యంత్రాలను ఐటీడీఏ పీవో అభిషేక్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వంద శాతం రాయితీపై పంపిణీ చేస్తున్న పసుపు శుద్ధికరణ యంత్రాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పసుపు శుద్ధి యంత్రాలతో నాణ్యత మెరుగు పడటం వలన మంచి ధరలు వస్తాయన్నారు. రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. గిరిజన రైతులకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా పసుపు రైతులకు మంచి ధరను కల్పిస్తున్నమని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం కాఫీ పల్పింగ్ యూనిట్ కేంద్రాన్ని సందర్శించారు.పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. పీహెచ్‌వో అశోక్, హెచ్‌వో బాలకర్ణ ,వెలుగు ఏసీవో అప్పలనాయుడు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం కృషి

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురందేశ్వరి



మాట్లాడుతున్న పురందేశ్వరి, వేదికపై జిల్లా కార్యదర్శి రాజారావు

అరకులోయ రూరల్: కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న నిధులతో రాష్ట్రాలు అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అరకులోయ మండల కేంద్రంలో సోమవారం నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. విజయనగరం జిల్లా కేంద్రం నుంచి అరకులోయ, పాడేరు మీదుగా రాజమండ్రి వరకు రూ.1500 కోట్లతో 350 కిలో మీటర్ల జాతీయ రహదారి పనులను కేంద్ర ప్రభుత్వం చేపట్టినట్టు చెప్పారు. బీజేపీ ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనలో అరకు పార్లమెంట్ పరిధిలో ఉన్న గిరిజన ప్రాంతాల్లో 17 వేల ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గృహాలు మంజూరు చేసినట్టు తెలిపారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా రూ.350 కోట్లతో ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నట్టు చెప్పారు. అనంతరం అరకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు మాట్లాడుతూ గతంలో ఏనాడు లేనివిధంగా కేంద్ర ప్రభుత్వం చొరవతో రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. 2024 ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే మరింత మార్పు వస్తుందన్నారు. ప్రతి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగిరేలా పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు సురేంద్రమోహన్, మఠం శాంతికుమారి, ఉమామహేశ్వరరావు, రాంచందర్, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోఎఫ్ఆర్ పట్టాలివ్వాలి

- స్పందనలో గిరిజనుల అర్జీ

రంపచోడవరం: తాము తొమ్మిదేళ్లుగా సాగు చేసుస్తున్న కొండపోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని రాజవొమ్మంగి మండలానికి చెందిన తొమ్మిది మంది గిరిజనులు స్పందనలో అర్జీ అందజేశారు. రంపచోడవరం ఐటీడీఏ సమావేశం హాలులో పీవో సూరజ్ గనోర్, సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌లు సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. 53 అర్జీలు వచ్చినట్టు పీవో తెలిపారు. దేవీపట్నం మండలం కచ్చులూరు గ్రామానికి చెందిన పోలవరం నిర్వాసితుల డి పట్టా భూమికి నష్టపరిహారం చెల్లించాలని, 32 మందికి చెట్లకు నష్టపరిహారం చెల్లించాలని బేలం సీతారాములు, కోసు తులసి తదితరులు కోరారు.మారేడుమిల్లి పీహెచ్‌సీకి దగ్గరలో ఉన్న గ్రామాల్లో వైద్య సేవలు అందించాలని వేటుకూరి సర్పంచ్ ఈతపల్లి మల్లేశ్వరి ,గొర్లె చిన నారాయణ కోరారు. చింతలపూడి పంచాయతీ వీడరేవు కాలువపై వంతెన నిర్మించాలని, వాటర్ షెడ్ పథకంలో ఏర్పాటు చేసిన సోలార్ లైట్లకు మరమ్మతులు చేయాలని సర్పంచ్ పల్లాల సన్యాసమ్మ పీవోకు అర్జీ అందజేశారు.ఆకూరులోని రబ్బరు ప్రొసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని గిరిజన రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ డీఎస్ శాస్త్రి, ఈఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయమందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు

రంపచోడవరం: రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్యాంటిన్ నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థి క్యాన్సర్‌తో చనిపోవడంతో కళాశాల ద్వారా నిర్వహిస్తున్న హెల్పింగ్ హ్యాండ్ ద్వారా ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డి.రవికుమార్‌ల ఆధ్వర్యంలో రూ.25 వేలను మృతుడి కుటుంబానికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కళాశాలలో నిర్వహిస్తున్న హెల్పింగ్ హ్యాండ్ ట్రస్టు ద్వారా అధ్యాపకులు, విద్యార్థులు సంయుక్తంగా విరాళాలు సేకరించి, బాధిత కుటుంబాలకు సాయమందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా సేకరించిన రూ.25వేల విరాళాన్ని మృతి చెందిన పూర్వ విద్యార్థి కుటుంబానికి అందజేశామన్నారు. అధ్యాపకులు చక్రవర్తి, ప్రభాకర్, హెల్పింగ్ హ్యాండ్ కన్వీనర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేతల బైక్ ర్యాలీ

చింతూరు: పోలవరం ప్రాజెక్టు సత్వరమే పూర్తిచేయాలని, ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి అన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26న పోలవరంలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు సంఘీభావంగా సోమవారం చింతూరులో సీపీఐ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ నిర్వాసితులకు త్వరితగతిన పరిహారం, పునరావాసం కల్పించాలని కోరారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని, నాయకులు సత్యనారాయణ, దుర్గాప్రసాద్, ఎస్‌కె రంజాన్, మోహనరావు, రాఘవులు, కన్నారావు, నాగరాజు పాల్గొన్నారు.

తియ్యగెడ్డలో మహిళ హత్య

- పాడేరులో యాచకుల మధ్య ఘర్షణ...ఒకరి మృతి
- ఒకే రోజు రెండు ఘటనలతో ఉలిక్కిపడిన జనం



మృతి చెందిన యాచకుడు

పాడేరు రూరల్ : పాడేరు మండలంలో ఒకే రోజు రెండు హత్యా సంఘటనలు చోటు చేసుకోవడంతో స్థానికులు ఆందోళన చెందాడు. పాడేరు మండలం తియ్యగెడ్డ గ్రామంలో ఓ మహిళ హత్యకు గురవ్వగా పాడేరు పట్టణంలో ఇద్దరు యాచకుల మధ్య జరిగిన ఘర్షణలో మరో యాచకుడు హత్యకు గురయ్యాడు. ఈ రెండు ఘటనలకు సంబంధించి పోలీసులు ఎటువంటి వివరాలు ఇంకా వెల్లడించలేదు. ప్రాథమిక సమాచారం ప్రకారం అల్లూరి సీతారామరాజు జిల్లా జి. మాడుగుల మండలం కోరాపల్లి గ్రామానికి చెందిన కోరాబు గాయత్రి అనే మహిళ భర్తతో విడిపోయి వేరుగా ఉంటోంది. అదే గ్రామానికి చెందిన గణపతితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్టు సమాచారం. మూడు రోజుల క్రితం గణపతి తమ బంధువుల గ్రామమైన పాడేరు మండలం తియ్యగెడ్డకు ఆమెను తీసుకువచ్చాడు. ఈ నేపథ్యంలో ఈనెల 16న వారి మధ్య ఘర్షణ చోటు చేసుకుని ఆమెను చీరతో ఉరేసి చంపేసి గ్రామ శివార్లో పూడ్చి పెట్టినట్టు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న వనుగుపల్లి సర్పంచ్ భర్త, వీఆర్వో సదానందరావు, పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు సోమవారం గ్రామానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని బయటకు తీసి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రస్తుతం నిందితుడు గణపతి పోలీసుల అదుపులో ఉన్నట్టు తెలిసింది.

యాచకుల మధ్య ఘర్షణలో...

పాడేరు పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియా వెంకటేశ్వర లాడ్జి ఎదురుగా ప్రధాన రహదారిపై సోమవారం సాయంత్రం ఇద్దరు యాచకులు మత్తులో ఘర్షణకు దిగారు. స్థానికులు కలుగజేసుకొని వారిని అక్కడి నుంచి పంపించివేశారు. కానీ మరలా వీరి మధ్య పీఎంఆర్సీ దరి కేవీఆర్ ఫార్చ్యున్ హోటల్ ఎదురుగా రాత్రి ఘర్షణ జరగడంతో ఓ యాచకుడు తన వద్ద ఉన్న కత్తితో మరో యాచకుడిని పొడిచాడు. దీంతో దీంత్రో తీవ్ర గాయాలై అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

స్పెషల్ బ్రాంచ్ హెచ్‌సీకు ఎస్పీ ప్రశంస



ఎస్ఐ గోపీనరేంద్రప్రసాద్ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న హెచ్‌సీ దుర్గారావు

రాజవొమ్మంగి: ఉత్తమ సేవలందించిన స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న స్పెషల్ బ్రాంచ్ హెచ్‌కానిస్టేబుల్ ఎన్.వి. దుర్గారావుకు ఎస్పీ తుహిన్ సిన్హ ప్రశంసలు లభించాయి. పాడేరులో ఈనెల 16న జరిగిన ఓ కార్యక్రమంలో ఎస్పీ అవార్డు ప్రకటించారు. స్థానిక ఎస్ఐ గోపీనరేంద్రప్రసాద్ వాటిని తనకు అందజేశారని హెచ్‌సీ దుర్గారావు తెలిపారు. దుర్గారావును స్టేషన్ సిబ్బంది అభినందించారు.

పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరంలో సోమవారం సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. వారపు సంత, ప్రభుత్వ కార్యాలయాలకు పనులపై వచ్చిన సుమారు 200 మందికి భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అసిస్టెంటు కమాండెంటు ఎం.ఎల్. నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి నిర్వాసితుల సమస్యలు

రాజవొమ్మంగి: మండలం మీదుగా వెళుతున్న ఎన్‌హెచ్ 516 రహదారి నిర్మాణంలో ఇళ్ళు, స్థలాలు, భూములు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలని కోరుతూ జడ్డంగికి చెందిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జడ్డంగిలో రోడ్డు విస్తరణలో భాగంగా పలువురికి అన్యాయం జరుగుతోందని, పలు ఇళ్లు గ్రామకంఠంలో నిర్మించుకున్న వాటికి రిజిస్ట్రేషన్లు లేవని పేర్కొన్నారు. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకొన్న సబ్ కలెక్టర్ కట్టడాలకు రెండింతల నష్టపరిహారాన్ని ఇస్తామని తొలుత ప్రకటించారని, అయితే ఇప్పుడు ప్రకటించిన జాబితాలో కట్టడానికి చెందిన విలువ మాత్రమే ఇస్తామని ప్రకటించారని తెలిపారు. కోల్పోతున్న ఇళ్లకు సంబంధించి విలువ మంజూరు చేయాలని కోరినట్టు ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సర్పంచ్ మురళీకృష్ణ తెలిపారు. మండల కన్వీనర్ రామకృష్ణ, నాయకులు వెంకటేష్‌రాజు, తాతారావు, కామేష్ తదితరులున్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

గొలుగొండ : స్థానిక కస్తూర్బా బాలికల వసతి గృహంలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న మైనర్ బాలిక అదృశ్యంపై గొలుగొండ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మండల పరిధిలో ఉన్న తాళ్ల చీడికాడ గ్రామానికి చెందిన బాలిక నాలుగు రోజుల క్రితం గొలుగొండలో ఉన్న కస్తూర్బా బాలికల వసతి గృహంలో చేరింది. అయితే ఆదివారం సాయంత్రం తన కుటుంబ సభ్యులు వచ్చారని తెలుపుతూ బాలిక కస్తూర్బా వసతి గృహం నుంచి బయటకు వచ్చింది. అయితే గంట సమయం అయినా ఆ బాలిక వసతిగృహానికి తిరిగి రాకపోవడంతో కస్తూర్బా ప్రత్యేక అధికారి సుధ గొలుగొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నారాయణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. సోమవారం చింతపల్లి ప్రాంతంలో బాలిక ఉన్నట్టు తెలియడంతో సిబ్బందితో విచారణ చేస్తున్నట్టు చెప్పారు.

చెట్టు నుంచి జారి పడి వ్యక్తి మృతి

గొలుగొండ : మండలంలో చోద్యం గ్రామానికి చెందిన ఎ.సత్తిబాబు అనే వ్యక్తి చింతచెట్టు నుంచి జారి పడి సోమవారం ఉదయం మృతి చెందాడు. సత్తిబాబు తన ఇంటి వద్ద ఉన్న చింతచెట్టు ఎక్కి కొమ్మలు కోస్తుండగా ప్రమాదవశాత్తూ చెట్టు పైనుంచి జారిపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే గొలుగొండ పీహెచ్‌సీకి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సత్తిబాబు మృతిచెందాడు. దీనిపై కృష్ణదేవిపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



ఫైరింజన్ సాయంతో మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

దేవీపట్నం : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక పూరిల్లు దగ్ధమైంది. ఇందుకూరుపేటలోని దళితవాడలో చిడిపి సరోజిని అనే మహిళకు చెందిన పూరిల్లు సోమవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదానికి గురైంది. ప్రమాదంలో బాధితురాలికి చెందిన గృహోపకరణాలు మొత్తం కాలి బూడిదయ్యాయి. స్థానికులు అప్రమత్తమై మంటలు పక్క ఇళ్లకు వ్యాప్తి చెందకుండా నిరోధించారు. రంపచోడవరం ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందిచడంతో ఫైరింజన్ సాయంతో శకలాలను ఆర్పివేశారు. సుమారు లక్షన్నర ఆస్తి నష్టం సంభవించిందని బాధితులు తెలిపారు.

ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దంపతులకు పరామర్శ



ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, డాక్టర్ నరసింగరావు దంపతులను పరామర్శిస్తున్న మన్యం జిల్లా పార్టీ నేత పరీక్షిత్‌రాజ్

సాక్షి,పాడేరు: ఇటీవల మాతృమూర్తి మృతితో విషాదంలో ఉన్న ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు, ఆయన భార్య పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి దంపతులను మన్యం పార్వతీపురం జిల్లా వైఎస్సార్‌సీపీ నేత, మాజీ డిప్యూటీ సీఎం, కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి భర్త శత్రుచర్ల పరీక్షిత్‌రాజ్ సోమవారం పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ విద్యార్థి విభాగ నేత సురేష్‌కుమార్, మాజీ సర్పంచ్ కన్నాపాత్రుడు తదితరులున్నారు.